క్లుప్తంగా

నీటి సమస్య పరిష్కారం



పెంట్లవెల్లి: మండలంలోని ఎంగంపల్లి తండాలో కొంతకాలంగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మాజీ సర్పంచ్ గోపినాయక్ గ్రామంలో తాగునీటి సమస్యను మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. దీంతో గ్రామస్తులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ కోతలతో ఇబ్బందులు

చారకొండ: మండలంలోని జూపల్లిలో మూడు రోజులు నుంచి సమాచారం లేకుండా సాయంత్రం 4:00 గంటల నుంచి రాత్రి 7:00 గంటల వరకు అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. దీంతో ఉక్కపోతతో చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామానికి సంబంధించిన విద్యుత్ అధికారి ఫోన్ అందుబాటులో ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఏఈ జానకి రామ్‌ను వివరణ కోరగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఎం గ్రామ కార్యదర్శి రవి ప్రభుత్వాన్ని బుధవారం ఓ ప్రకటనలో కోరారు. రైతులు పండించిన వరి ధాన్యం విక్రయాల కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని లేనపక్షంలో ధర్నా కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు.

ఓటు హక్కుపై అవగాహన



పెంట్లవెల్లి: మండలంలోని సింగవరంలో బుధవారం ఉపాధికూలీలకు ఆయా గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు, ఎంపీడీఓ సిబ్బంది ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏపీఓ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు కీలకమన్నారు. ప్రతి ఒక్కరు మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధి హామీ కూలీలకు మౌలిక వసతులు కల్పిస్తామని కోరారు. కార్యక్రమంలో మోహన్‌కృష్ణ, రమేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సమన్వయలోపంతో పార్టీకి నష్టం

వెల్దండ: మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో బీజేపీ నాయకులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుల తీరుతో బీజేపీకి నష్టం వాటిల్లే అవకాశం ఉందని పలువురు కార్యకర్తలు సమావేశంలో లేవనెత్తారు. జిల్లా నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం కొరవడిందని వివరించారు. పార్టీకి పనిచేసేవారిని గుర్తించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు విజేందర్‌రెడ్డి, నాయకులు చిందం కృష్ణయ్య, శ్రీనివాసులు, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బూత్ కమిటీల అధ్యక్షులు తదితరులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

కొల్లాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని కొల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ సూచించారు. బుధవారం కళాశాలలో మూడో సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. జూనియర్ విద్యార్థులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు.

ఆర్థికసాయం అందజేత

సాక్షి, నెట్‌వర్క్: తెలకపల్లి మండల కేంద్రానికి చెందిన పరశురాములు అనారోగ్యంతో మృతి చెందడంతో బుధవారం నాగం శశిధర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ. 15వేలు ఆర్థిక సాయం అందజేశారు. వెల్దండ ఈదమ్మబండ తండాలో నేనావత్ ఉంగ్లి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి రూ.10వేలు, అదేవిధంగా మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, చిన్న జంగయ్యయాదవ్‌లు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కోడేరు మండలంలోని నర్సాయిపల్లిలో గంగాయ్య కుటుంబానికి మాజీ సర్పంచ్ సత్యనారాయణ రూ.5 వేలు అందజేశారు.

నిరుపయోగంగా చెక్ డ్యాంలు

- రైతులకు అందని సాగు నీరు
- బీళ్లుగా మారుతున్న భూములు



చెన్నంపల్లి శివారులో నిరుపయోగంగా ఉన్న చెక్ డ్యాం

లింగాల: రైతులు సాగు చేసిన పంటలకు సాగునీరు అందించేందుకు గతంలో ప్రభుత్వం చెక్‌డ్యాం నిర్మాణాలకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా మండలంలో రెండు చెక్ డ్యాం నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. శ్రీరంగాపూర్ నుంచి చెన్నంపల్లి వెళ్లే మార్గంలో ఒకటి, మరోకటి చెన్నంపల్లి నుంచి ఎర్రపెంట వెళ్లే మార్గంలో చెక్ డ్యాంలను నిర్మించారు. 2009వ సంవత్సరం గత పాలకులు ప్రారంభించారు. ఒక్కో దానికి దాదాపుగా రూ.70 లక్షల వ్యయంతో నిర్మించారు. వాగుల నీరు వృథా కాకుండా చెక్‌డ్యాం నిర్మాణం ద్వారా సాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారు. కాని ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉన్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు సాగునీరు పంపిణీలో అశ్రద్ధ వహిస్తున్నారు.

కాల్వలు లేక..

బీడు భూములను సస్యశ్యామలం చేయుటకు ఉద్దేశించిన చెక్ డ్యామ్‌ల నిర్మాణం పనులు అసంపూర్తిగా కొనసాగాయి. చెక్ డ్యామ్‌ల నుంచి పొలాలకు నీటిని అందించుటకు అవసరమైన కాల్వలను ఏర్పాటు చేయలేదు. అప్పట్లో కాల్వ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఇచ్చే పరిహారం చెల్లింపులో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో కాల్వల పనులు ముందుకు సాగలేదు. కాలానుగుణంగా చెక్ డ్యాంల విషయాన్ని పాలకులు, సంబంధిత నీటి పారుదల శాఖ అధికారులు పూర్తిగా విస్మరించారు.

సాగునీరు లేక రైతుల అవస్థలు

చెన్నంపల్లి, పద్మన్నపల్లి తదితర గ్రామాలకు సాగునీరు లేక వేలాది ఎకరాల భూములు బీడుగా మారాయి. మండలంలోని పలు గ్రామాలకు ఇప్పటికే కేఎల్ఐ కాల్వల సాగునీరు అందుతుండగా ఈ ప్రాంతాలకు మాత్రం కేఎల్ఐ కాల్వలు లేకపోవడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు. చెరువులు, కుంటలలోకి నీరు చేరితేనే పంటలు పండే అవకాశం ఉంది.

కేఎల్ఐ కాల్వలను ఏర్పాటు చేయించాలి



చెన్నంపల్లి, పద్మన్నపల్లి గ్రామాలకు సాగునీటికి అవసరమైన కేఎల్ఐ కాల్వలు నిర్మించాలి. అప్పుడే బీడు భూములు సాగులోకి వస్తాయి. పాలకులు వచ్చే వర్షాకాలం నాటికి ఆయా చెక్ డ్యామ్‌ల కింద కాల్వల నిర్మాణాలకు కృషి చేయాలి. భూములు సస్యశ్యామలం కావడానికి ఎమ్మెల్యే చొరువ తీసుకోవాలి.

– రవీందర్‌నాయక్, మాజీ సర్పంచ్, చెన్నంపల్లి

నేలరాలిన మామిడి కాయలు



నేలరాలిన మామిడి కాయల వద్ద రైతు

లింగాల: మండలంలోని పలు గ్రామాల్లో ఈదురు గాలులకు, వర్షానికి మామిడి తోటలకు అపార నష్టం వాటిల్లింది. మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో మామిడి చెట్లు నేలకొరిగాయి. పలు చోట్ల మామిడి కాయలు నేలరాలాయి. మండలంలోని అంబట్‌పల్లి శివారులో రైతు వెంకటయ్య 10 ఎకరాల మామిడి తోటను లీజుకు తీసుకోగా ఈదురుగాలులకు పెద్ద మొత్తంలో మామిడి కాయలు నేలరాలడంతో లబోదిబోమన్నారు. రైతును ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కూలీలకు పని దినాలు పెంచాలి



సభ్యత్వాలను అందజేస్తున్న నరసింహ

కోడేరు: ఉపాధిహామీ కూలీలకు పనిదినాలు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎత్తంలో నడుస్తున్న ఉపాధి హామీ కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో సంవత్సరానికి 200 రోజులు పని దినాలు కల్పించి ప్రతి రోజు కూలీకి రూ. 600 ఇవ్వాలని డిమాండ్ అనంతరం ఉపాధి హామీ సంఘం సభ్యత్వం నిర్వహించి గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా వెంకట్, కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షుడిగా మహేష్, రాములు, కమలమ్మ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ముమ్మరంగా బీజేపీ ఇంటింటి ప్రచారం



కల్వకుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కొల్లాపూర్/ కొల్లాపూర్ రూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో బీజేపీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఓటర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. అదేవిధంగా మండలంలోని ఎల్లూరులో బీజేపీ మండల అధ్యక్షుడు సాయికృష్ణ గౌడ్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్‌కు మద్దతుగా ఇంటింటి చేస్తూ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సందు రమేష్, ధనుంజయ్‌గౌడ్, కడ్తాల కృష్ణ, నాయకులు, కార్యకర్తల పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని విద్యానగర్ 109 పోలింగ్‌బూతు పరిధిలో జిల్లా కార్యవర్గ సభ్యుడు నరేడ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికి మోదీ గ్యారంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. రాంభూపాల్‌రెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాసులు, శివాజీ, నరేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

అమ్రాబాద్: బీజేపీ ఎంపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు మండల అధ్యక్షుడు ప్రచారం చేశారు. గోలిరాజు, శ్రీనివాసులు, శంకర్‌గౌడ్, రమేష్‌గౌడ్, హనుమంతు తదితరులు ఉన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గన్నోజు నరేంద్రాచారి ఇంటింటి వెళ్లి అభ్యర్థించారు. గుండూరు రాము, భాషమోని శివ, లక్ష్మణ్, భానుగౌడ్ పాల్గొన్నారు. మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు నాగర్‌కర్నూల్‌లోని పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి మురుగన్ సమక్షంలో బీజేపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో కొండల్‌రావు, యాదయ్య, స్వామిరెడ్డి ఉన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీపాచారి, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, మండల కోఆర్డినేటర్ బాబుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలు బడిలోనే ఉండాలి



వెంకటేశ్వర్లబావిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న కోనేరు సంస్థ సభ్యులు

మన్ననూర్: బాల బాలికలందరు పనిలో కాకుండ బడిలో ఉండాలని కోనేరు సంస్థ డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. బుధవారం అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్లబావిలో సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్ ఫ్రీ భారత్ నిర్మాణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 14 ఏళ్ల లోపు పిల్లలందరు బడిలోనే ఉండాలన్నారు. అంతకు ముందు తెల్లవారుజామున బాల కార్మిక వ్యవస్థ నిర్మూలకు సంబంధించిన నినాదాలు చేస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ నవీన్, నాయకులు అంబనారాయణ, శంకరయ్య, సంస్థ సిబ్బంది ఇస్మాయిల్, జాకీర్, బాలకృష్ణ, తిరుపతి, శ్రీను, ప్రవీణ్, ఏలేష్, అమీనబేగం అంగన్‌వాడీ టీచర్, ఆయ, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

విరిగిన చెట్లు.. వ్యక్తికి తీవ్రగాయాలు

లింగాల: లింగాల నుంచి కొత్తకుంటపల్లి మార్గంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులకు విరిగి పడిన చెట్లను తొలగించక పోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. బుధవారం రాత్రి మండలంలోని జీల్గుపల్లితండాకు చెందిన దివ్యాంగుడు లక్ష్మణ్‌నాయక్ మూడు చక్రాల వాహనంపై లింగాల నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా.. ప్రమాదానికి గురయ్యాడు. రాత్రి కావడంతో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును గమనించకపోవడంతో దానిని తాకిన వాహనంతో పాటు ఆ వ్యక్తి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడిపోయాడు. అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి వ్యక్తిని గోతిలో నుంచి బయటకు తీశారు. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈదురు గాలులకు రోడ్లకు అడ్డంగా చెట్లు విరిగి పడినా సంబంధిత పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. విరిగిన చెట్లను తొలగించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అమ్రాబాద్: మండల కేంద్రంతో పాటు మండలంలోని కుమ్మరోనిపల్లి, ఈదులబావి, కల్ములోనిపల్లి, ఎల్మపల్లి తదితర గ్రామాల్లో బుధవారం తెల్లవారుజామున ఈదురు గాలులు, ఉరుములతో కూడిన మోస్తరు వర్షం కురిసింది.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



వెల్దండ నుంచి తరలుతున్న నాయకులు

చారకొండ: మండలంలోని జూపల్లి, చారకొండ, తిమ్మాయిపల్లిలో బీఆర్ఎస్ శ్రేణులు మండల అధ్యక్షుడు రవీందర్, జిల్లా నాయకుడు కలమందల జగపతి ఆధ్వర్యంలో వివిధ వాహనాల్లో కేటీఆర్ రోడ్‌షోకు తరలివెళ్లారు. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, డి. శ్రీరాములు, రవి,

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల పార్టీ నాయకులు బుధవారం కల్వకుర్తిలో నిర్వహించే కేటీఆర్ రోడ్‌షోకు భారీగా తరలివెళ్లారు. నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్‌కు మద్దతుగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్టరాంరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ శేఖర్‌ముదిరాజ్, నాయకులు ఐజాక్, మధుసూదన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తిర్మల్‌రావు, కొండల్‌యాదవ్, యాదగిరి, ప్రసాద్, శ్రీనువాస్, అశోక్, శ్రీను, నాగులు, శంకర్‌నాయక్, కొండల్ ఉన్నారు.

ఉపాధిహామీ చట్టానికి కేంద్రం తూట్లు

తాడూరు: వామపక్షాన పోరాటాల ఫలితంగా 2005లో వచ్చిన ఉపాధిహామీ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భరత్ విమర్శించారు. బుధవారం మండలంలోని అంతారంలో చెరువు పూడికతీత పనుల్లో పాల్గొన్న ఉపాధి కూలీల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నిధులను తగ్గిస్తూ చట్టాన్ని పూర్తిగా ఎత్తివేసేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నరాములు, డీహెచ్‌పీఎస్ నాయకులు మైసమ్మ, లక్ష్మయ్య, బంగారయ్య, సుగుణమ్మ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి నివాళి

బిజినేపల్లి: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు బీరం వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు గ్రామానికి చేరుకొని గురువుకు కన్నీటి నివాళి అర్పించారు. అంతిమ యాత్రలో అధికసంఖ్యలో హాజరయ్యారు.

బీజేపీ, బీఆర్ఎస్ నాయకులను నిలదీయండి



మన్ననూర్: కేంద్రం, రాష్ట్రంలో పదేళ్ల పాటూ పరిపాలన చేసిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఓట్ల కోసం వస్తే నిలదీయాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీపీజేఏసీ) జిల్లా బాధ్యుడు గాజుల లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం మన్ననూర్‌లో ప్రజాసంఘాల నాయకులతో కలిసి కరపత్రం విడుదల చేశారు. బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్య లౌకిక దేశంలో హిందు దేశమంటూ కుల మతాల మధ్య విధ్వంసాలు తప్ప సాధించింది ఏమి లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఏ మోహం పెట్టుకుని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ధర్నా

చారకొండ: మండలంలోని గోకారం – చంద్రాయన్‌పల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బుధవారం గోకారంలో గ్రామస్తులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. గంటపాటు ధర్నా నిర్వహించారు. విద్యార్థులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

అమ్రాబాద్: మహిళ అదృశ్యమైన ఘటనలో బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎస్ఐ వివరాల ప్రకారం అమ్రాబాద్ మండలం సార్లపల్లి గ్రామానికి చెందిన మొగిళ్ల సాలమ్మ(40) గత నెల 26న ఇంటినుంచి బయటకు వెళ్లింది. బంధువుల ఇళ్లలో ఎంత వెతికినా సమాచారం తెలువకపోవడంతో మహిళా కుమారుడు మధు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీసీలకు రిజర్వేషన్లు పెంచుతాం



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

సాక్షి, నెట్‌వర్క్: కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీసీలకు రిజర్వేషన్లు పెంచుతామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. బుధవారం అచ్చంపేటలోని ఓ ఫంక్షన్ హాలులో ముదిరాజ్‌ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. అదేవిధంగా బల్మూరు మండలం పోలిశెట్టిపల్లి ఏసీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మహిళా ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి విజయం కోసం అందరు కృషి చేయాలని కోరారు. కోడేరు మండలంలోని ఎత్తం, సింగాయిపల్లి గ్రామాల్లో కార్యకర్తల సమావేశంలో సింగిల్ విండో డైరెక్టర్ జగన్‌మోహన్ రెడ్డి హాజరయ్యారు. మన్ననూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాల మహనాడు రాష్ట్ర కార్యదర్శి మద్దెల దివాకర్ మాట్లాడుతూ హస్తం గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. బిజినేపల్లి మండలం గంగారంలో కూచుకుళ్ల సుహాసన్ రెడ్డి ప్రచారం నిర్వహించారు. లింగాల మండల కేంద్రంలోని పలు వార్డుల్లో జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భాగ్యాబాయి ఇంటింటి ప్రచారం చేశారు. పెద్దకొత్తపల్లి మండలం మరికల్‌లో ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ మల్లురవిని గెలిపించాలని కోరారు. కొల్లాపూర్‌లోని సీపీఎం కార్యాలయంలో రైతుసంఘం నాయకులతో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు సమావేశమై మల్లురవికి మద్దతు ఇవ్వాలని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ అబ్జర్వర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. కల్వకుర్తి మండలం బెక్కెర, తురుకలపల్లి, వేపూరు గ్రామాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి విజయ్‌కుమార్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు. తాడూరు మండలంలోని మేడిపూరు, శిర్సవాడ, ఆకునెల్లికుదురు గ్రామాల్లో టీపీసీసీ సభ్యుడు కొలను వల్లబురెడ్డి పాల్గొన్నారు. చారకొండ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బాల్‌రాం గౌడ్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు, జూపల్లిలో వెంకటయ్య యాదవ్, గోకారంలో రాష్ట్ర యువజన నాయకుడు ఆశాదీప్ రెడ్డి కరపత్రాలను పంపిణీ చేశారు. కల్వకుర్తిలోని టీఎస్ యూటీఎఫ్ భవనంలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్ మాట్లాడారు.

కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం...



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సాక్షి, నెట్‌వర్క్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదామని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లిలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. కల్వకుర్తి పట్టణంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో మాదిగల రాజకీయ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాదిగల ఆత్మగౌరవ సభ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలతో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. రూ.2లక్షల రుణమాఫీ ఏమైందని ప్రశ్నించారు. తెలకపల్లి మండలంలోని పర్వతాపూర్, గౌరారం, నడిగడ్డ గ్రామాల్లో నాగం శశిధర్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కొల్లాపూర్ మండలంలోని కుడికిల్ల, నార్లాపూర్, ముక్కిడిగుండం, ఎన్మన్‌బెట్ల, తదితర గ్రామాల్లో నాయకులు వెంకటేశ్వరావు, ఎంపీటీసీ బిచ్చయ్య ఇంటింటి ప్రచారం చేశారు. వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ హామీలతో మరోసారి మోసపోవద్దన్నారు. అజిలాపూర్ గ్రామానికి చెందిన దాదాపుగా 30 మంది బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ విజితారెడ్డి, ఎంపీటీసీలు పాల్గొన్నారు.